క్లుప్తంగా

29న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ అత్యవసర సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్మన్ అలీమ్‌బాషా సోమవారం తెలిపారు. వివిధ అభివృద్ధి పనులపై చర్చించేందుకు ఏర్పాటు చేస్తున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



శయనోత్సవంలో స్వామివారు

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ కాశీ విశ్వేశ్వరుని బ్రహ్మోత్సవాలు సోమవారం శయనోత్సవంతో పరిసమాప్తమయ్యాయి. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన భక్తులు, పట్టణ ప్రజలకు ఆలయ కమిటీ చైర్మన్ వీరభద్ర, సభ్యులు గోపాల్‌రెడ్డి, హరీష్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

సరిహద్దుల్లో నిఘా ముమ్మరం

- డబ్బు, మద్యం అక్రమ తరలింపులపై నిఘా
- డీఎస్‌ఈఓ ఏవీ సుబ్బరాజు



గంద్రాజుపల్లె చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్‌ఈఓ సుబ్బరాజు

పలమనేరు: రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే తమ లక్ష్యమని ఇందుకోసం కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిఘా ముమ్మరం చేశామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏవీ సుబ్బరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన పలమనేరు సెబ్ స్టేషన్ పరిధిలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు గంద్రాజుపల్లె చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఎన్నికల సంఘం స్వతంత్ర వ్యవస్థ కాబట్టి ఎలాంటి మొహమాటం లేకుండా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. తాము ఎన్నికల సంఘానికి కట్టుబడి పని చేస్తామన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు డబ్బు, లిక్కర్ ఇక్కడికి అక్రమ రవాణా చేయకుండా ఇప్పటికే సరిహద్దులో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. ఆయన వెంట స్థానిక సెబ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రికి కేంద్ర బృందం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం కేంద్ర బృందం రానున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు బృంద అధికారులు ఆస్పత్రికి చేరుకుంటారన్నారు. పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలపై తనిఖీ చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

8న మణికంఠేశ్వర స్వామికి పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8న శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా మణికంఠేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్‌కే విద్యాలయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బద్రీనారాయణ అన్నారు. నగరంలోని మిట్టూరులో ఉన్న ఆ కళాశాలలో సోమవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం చిత్తూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

జయహో జగనన్న

- ఉప్పొంగిపోతున్న కుప్పం ప్రజానీకం
- అందరి హృదయాల్లో కృష్ణమ్మ పరవళ్లు

కుప్పం: హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు 1986లో ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. దీంతో ఈ ప్రాజెక్ట్ పూర్తిచేసి కుప్పానికి నీళ్లు ఇస్తారని స్థానికులు సంబరపడ్డారు. అనంతరం అధికారంలో ఉన్నా చంద్రబాబు ఈ ప్రాజెక్టు ఊసే లేకుండా చేసి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. ఆ తర్వాత 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర రెడ్డి హంద్రీ–నీవా కాలువ ఆశలకు నీళ్లు పోశారు. అనంతరం జరిగిన పరిణామాలతో కాలువ పనులు ఆగిపోవడంతో కృష్ణా జలాల కల కలగానే మారింది. 2019 అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి దీనిపై దృష్టి సారించి నాలుగు దశాబ్దాల కలను సాకారం చేయడం..కృష్ణా జలాలను ప్రారంభించడంతో కుప్పం ప్రజానీకం ఉప్పొంగిపోతోంది.



నమస్తే జగనన్నా..



నమస్తే చెల్లెమ్మా.. నీళ్లు విడుదల చేసి, కాలువ గట్టు మీద ఉన్న ప్రజలకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి సీఎం



అన్నకోసం చెల్లెమ్మ.. మామయ్య కోసం..



జగనన్నా.. మీవెంటే మేమున్నా..







మా మనవడు జగన్ వచ్చాడయ్యా..



సీఎంను చూసి మహిళల్లో ఆనందం



సీఎం సభకు వస్తున్న జనం



సీఎం సభలో ప్లకార్డులతో లబ్ధిదారులు



దారులన్నీ కిక్కిరిసి..

కరువు తీరినట్టే!



హంద్రీ–నీవా కాలువతో కృష్ణా నీళ్ల కుప్పం నియోజకవర్గానికి రావడంతో మా కరువు తీరింది. ఇక్కడ వర్షాలు కురిసి చెరువు నిండితే వ్యవసాయం. వర్షాలు లేక చెరువు ఎండిపోయిన ప్రతిసారీ కరువుతో నానా కష్టాలు పడేవాళ్లం. 40 ఏళ్లుగా ఇదే పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ–నీవా కాలువతో నీళ్లను కుప్పానికి తీసుకురావడంతో కరువు తీరినట్లే! –గోవిందప్ప, బెండన్‌కుప్పం, శాంతిపురం మండలం

మా ఊరికి నీళ్లొచ్చినాయొచ్!



మా ఊరి పక్కన హంద్రీ–నీవా కాలువలో నీళ్లొస్తాంటే ఎంత ఆనందంగా ఉన్నిందో! పదేళ్లుగా కాలువను చూస్తూ పడిన బాధలు పడ్డాం. ఇప్పుడు ఆనందంతో కన్నీళ్లొస్తాండాయి. నీళ్ల పారతాంటే మాకు చూసేదానికి రెండు కళ్లు చాల్లా. యాడ శ్రీశైలం..యాడ కుప్పం? అక్కడ నుంచి ఈడికి నీళ్ల తీసుకొచ్చి జగన్‌మోహన్ రెడ్డి దేవుడైనాడు. ఆయనకు మేమంతా కాళ్లకు మొక్కుతామయ్యా. ఆయన పథకాలతో ఎందరో జీవితాలు బాగుపడినాయి..కుటుంబాలు నిలిచినాయి.ఎన్ని జన్మలెత్తినా ఈ మేలు తీర్చుకోలేం. –గుండిశెట్టిపల్లె గ్రామ మహిళలు

ఇక చరిత్రలో చిరస్థాయి



కుప్పం ప్రాంతంలోని కరువును తీర్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డి కృతజ్ఞతలు. మాతరం పడిన బాధలను భవిష్యత్తు తరాలు పడకుండా ఉండాలని మనసు పెట్టిన అందరి గుండెల్లో నిలిచిపోయారు. కుప్పం ప్రజలు దీనిని ఎప్పటికీ మరచిపోరు. పాలారు ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన వైఎస్ రాజశేఖర రెడ్డిని ఇప్పటికీ కుప్పం ప్రజలు మరచిపోలేదు. హంద్రీ–నీవా కాలువతో కృష్ణా నీళ్ల తీసుకొచ్చిన జగన్‌మోహన్ రెడ్డి కుప్పం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. –చంద్రప్ప, బీఎం గొల్లపల్లె, శాంతిపురం

బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే..!



హంద్రీ–నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు, (ఇన్‌సెట్) సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

- తండ్రి పాలనలో పునాది–తనయుని హయాంలో పూర్తి
- నాలుగు దశాబ్దాల కల సాకారం చేసిన జగనన్న
- తీరనున్న సాగు, తాగునీటి కష్టాలు
- కుప్పం చరిత్రలో సరికొత్త అధ్యాయం
- ఎమ్మెల్సీ భరత్ హర్షం

కుప్పం: కుప్పం ప్రజల నాలుగు దశాబ్దాల కల సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజలాలను పారించి కుప్పం చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. సోమవారం రాజుపేట వద్ద హంద్రీ–నీవా నుంచి కృష్ణా జలాలను కుప్పం నియోజకవర్గానికి తరలింపును సీఎం ప్రారంభించారు. బహిరంగ సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ–నీవా కాలువ పనులకు పునాదులు వేస్తే..ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో కాలువ పనులు పూర్తి చేసి కుప్పం ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలను తీర్చారన్నారు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గేయంలో శంకరంబాడి సుందరాచార్యులు 'బిరా బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే..' అన్న మాటలు ఇక్కడ దృశ్యపరంగా కుప్పం ప్రజానీకానికి ఆవిష్కృతమైందన్నారు. దాదాపు 750 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా జలాలను కుప్పం తీసుకువచ్చేందుకు జగన్‌మోహన్ రెడ్డి భగీరథ ప్రయత్నం చేశారన్నారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా రాజకీయాల్లో సొంత డబ్బా కొట్టుకునే చంద్రబాబునాయుడు ఇన్నేళ్లలో కుప్పం ఏం చేశారనేది ప్రజలు ఇకనైనా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షనేత ఎమ్మెల్యేగా ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నా వివక్ష చూపకుండా, రాజకీయాలకు అతీతంగా, కేవలం నాలుగున్నరేళ్ల కాలంలో జగనన్న కుప్పం అభివృద్ధిని పరుగులు తీయించారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పులివెందుల, కుప్పంను రెండు కళ్లలా భావిస్తూ సమప్రాధాన్యత ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధిని ఉదహరించారు. నాలుగు మండలాలకు ప్రత్యేకంగా రెవెన్యూ డివిజన్, అలాగే పోలీస్ సబ్ డివిజన్ , కుప్పం మున్సిపాలిటీని ఏర్పాటు చేశారని, మున్సిపాలిటీ అభివృద్ధికి 66 కోట్ల రూపాయలు విడుదల చేశారని వివరించారు. దుష్ట చతుష్టయం, ప్యాకేజీ స్టార్, కుర్చీలు మడతపెట్టే వాళ్లను తరిమికొట్టేందుకు తామంతా సిద్ధమని ప్రకటించారు.

పారిశ్రామికవాడ, ఇంజినీరింగ్ కాలేజీ ప్లీజ్!

కుప్పం ప్రాంతం నుంచి కూలీ పనుల కోసం బెంగళూరుకు పెద్దసంఖ్యలో వెళ్తున్నారని భరత్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తే వలసలు వెళ్లే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.



ఫ్యాన్.. ఫ్యాన్స్



జగన్నినాదం: మేము సిద్ధం

కనుల పండువగా వసంతోత్సవం

వి.కోట: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం వసంతోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రాజస్థాన్ సమాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి చిత్రగోపురం , శయనోత్సవం నిర్వహించారు. మొదట స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, రకరకాల పుష్పాలతో సుంధరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారిని ఉత్సవ మూర్తులుగా కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు శరవణ, ధర్మకర్త సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలుడు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

గుడిపాల: నాబార్డ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నంగమంగళం భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ తులసీరామ్ అన్నారు. బొమ్మసముద్రం, గట్రాళ్లమిట్ట గ్రామాల్లో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన బ్యాంకులో ఉండేటువంటి రుణాలు, ప్రధానమంత్రి సురక్షబీమా, జీవన జ్యోతి బీమా, అటల్ పింఛన్ యోజన, సామాజిక భద్రత పథకాలు, బీమా, పొదుపు సంఘాలు, సైబర్‌నేరాల గురించి గ్రామస్తులకు అర్థమయ్యే రీతిలో వారికి వివరించారు. రూరల్ పోర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి



కల్లూరులో విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): జరగ బోవు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని హెచ్‌ఎం శ్రీవాణి ఆకాంక్షించారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, తొలిసారి హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు పరీక్షలు రాయనున్నారని, పరీక్షల్లో ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా రాయాలన్నారు. అనంతరం విద్యార్థులకు దాతలు విద్యాసామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు

- దరఖాస్తులు చేసుకోండి: ఎంఈఓ

రొంపిచెర్ల: ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఇందిర సోమవారం కోరారు. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని నిర్ణయించిందని, ఇందుకుగాను మార్చి 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదేళ్లు నిండిన విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్చుకుంటామన్నారు. కుటుంబానికి వార్షికాదాయం రూ.1.20 లక్షలలోపు ఉండాలని, రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో శ్రీమేధా, శ్రీవాణి, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో ఆకాష్, పీపుల్స్ సాఫ్ట్ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు ఉన్నాయని, ఆ పంచాయతీల పరిధిలోని పేద విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.